క్లుప్తంగా

పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి



పినపళ్లలో నిరసన తెలుపుతున్న గ్రామ వలంటీర్లు

ఆలమూరు: గ్రామ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని మండల గ్రామ వలంటీర్ల సమాఖ్య డిమాండ్ చేసింది. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో గురువారం కూడా ఆందోళనలు కొనసాగాయి. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న గ్రామ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని ఈ సందర్భంగా వలంటీర్లు అన్నారు. క్షేత్రస్థాయిలోని వాస్తవాలను గమనించకుండా రాజకీయాల కోసం తమ పట్ల అనుచితంగా ప్రవర్తించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు జగ్గిరెడ్డి ఆర్థిక సాయం



అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: చెముడులంక శివారు గాంధీనగరంలో తాటాకిల్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన రెండు బాధిత కుటుంబాలకు కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి గురువారం రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. అగ్నిప్రమాద బాధితులు పేరపు నూకరాజు, మీసాల శంకరరావు కుటుంబాలను పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా రూ.15 వేల నగదు, 50 కేజీల చొప్పున బియ్యం, నూతన వస్త్రాలు అందజేశారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని పథకాలూ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకున్న సర్పంచ్ తమ్మన శ్రీనివాస్‌ను జగ్గిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు (బులిరెడ్డి) తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని మోటార్ సైక్లిస్ట్‌కు తీవ్ర గాయాలు

అయినవిల్లి: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కథనం ప్రకారం.. అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన బొగ్గు చరణ్‌తేజ జొమేటో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మోటార్ సైకిల్‌పై గురువారం మాగాం నుంచి అనాతవరం వైపు వెళ్తుండగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు, వెన్నెముకకు బలమైన గాయాలయ్యాయి. చరణ్‌తేజను స్థానికులు, బంధువులు తొలుత అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వ్యవసాయ మండలి సమావేశం

అయినవిల్లి: మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి వై.శోభ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, అభ్యుదయ రైతులు హాజరు కావాలని కోరారు.

పాశర్లపూడి నుంచి బస్సుయాత్ర

మామిడికుదురు: రాజోలు నియోజకవర్గ టీడీపీ బస్సు యాత్ర గురువారం పాశర్లపూడి నుంచి ప్రారంభమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆయన సతీమణి రమాబాయి విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం యాత్రను ప్రారంభించారు. మామిడికుదురు, మాకనపాలెం, కొమరాడ, మగటపల్లి, గోగన్నమఠం గ్రామాల మీదుగా ఈ యాత్ర సాగింది. తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు యూలి శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ బస్సు యాత్రలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, ఏవీ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

ఐ.పోలవరం: విశాఖపట్టణం వెళుతున్న ఓ ట్రాన్స్‌ఫోర్ట్ లారీ గురువారం జి.మూలపాలంలో ప్రమాదవశాత్తూ అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొని పంట బోదెలోకి బోల్తా పడింది. ప్రమాదం నుంచి డ్రైవర్ చాకచక్యంగా బయటపడినా క్లీనర్ మాత్రం లారీ లోపలే ఉండిపోవడంతో కాలు నుజ్జునుజ్జయింది. గాయపడిన క్లీనర్‌ను 108 వాహనంలో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



నాగుల్లంకలో ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని నాగుల్లంక గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ కమిటీ చైర్మన్ భీమాల సూరిబాబు, పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. అందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేసి, వీటి వలన కలిగిన లబ్ధిని కుటుంబాల వారీగా వివరించారు.

ఘనంగా గడప గడపకూ 250 రోజుల వేడుక

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే చిట్టిబాబు అన్నారు. నియోజకవర్గంలో ఈ కార్యక్రమం ప్రారంభించి 250 రోజులైన సందర్భంగా నాగుల్లంకలో ఆయన కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు గన్నవరపు శ్రీనివాస్, బూడిద వరలక్ష్మి, నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా సైన్యం.. వీరే ధైర్యం

- వెలకట్టలేని రీతిలో వలంటీర్ల సేవలు
- ఎంతో మేలు చేస్తున్నారంటున్న ప్రజలు

రావులపాలెం: గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారానికి, వివిధ సర్టిఫికెట్లు, రేషన్ కార్డుల వంటి వాటి కోసం మండల కేంద్రాల చుట్టూ పదేపదే ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి. విపత్కర పరిస్థితులు ఎదురైతే ఎవరి ప్రాణాలు వారు రక్షించుకోవాల్సిందే. ఇప్పుడలా కాదు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో ప్రభుత్వ పాలనను గ్రామ స్థాయికే తీసుకువచ్చారు. రేషన్ కార్డులు, ఏవైనా ధ్రువీకరణ పత్రాలు కావాలన్నా.. సంక్షేమ పథకాలు అందాలన్నా.. అన్ని అర్హతలూ ఉండి, గ్రామ వలంటీర్లకు చెప్తే చాలు.. ఇంటి ముంగిట్లోనే ఆ పనులు చకచకా పూర్తయిపోతున్నాయి. అంతే కాదు.. కరోనా, వరదల వంటి ఆపదల వేళ వలంటీర్లు సేవా సైన్యంగా ప్రజలకు అన్ని విధాలా అండగా నిలిచారు.. నిలుస్తున్నారు. వారికి ధైర్యం కల్పిస్తున్నారు. వెల కట్టలేని వారి సేవలను ప్రజలు వేనోళ్ల ప్రశంసిస్తున్నారు.

కరోనా సమయంలో.. సొంత వారిలా..



కరోనా వేళ ఇంట్లో నుంచి బయటకు రాలేని సమయంలో వలంటీర్లే మాకు అన్ని విధాలా సొంత వారిలా ఆసరాగా నిలిచారు. మా వలంటీర్ యార్లగడ్డ మహేష్ మాకు నిత్యావసర వస్తువులు, అవసరమైన మందులు తెచ్చి ఇచ్చేవారు. మా నుంచి ఎటువంటి ప్రయోజనం ఆశించకుండా కేవలం సేవాభావంతో పని చేస్తున్నారు.

– పోలవరపు గంగాధరరావు, ఇందిరా కాలనీ, రావులపాలెం

మనవడిలా.. ఆసరాగా..



వృద్ధాప్యంతో నడవలేని పరిస్థితి. గతంలో రేషన్ బియ్యం కోసం షాపు వద్దకు వెళ్లి పడిగాపులు పడాల్సి వచ్చేది. బియ్యం ఇంటికి మోసుకు తెచ్చుకోలేక నానా అవస్థలూ పడేదాన్ని. మా వలంటీర్ కాయల వెంకన్న సొంత మనవడిలా ప్రతి నెలా ఇంటి వద్దకే రేషన్ వ్యాన్ తీసుకు వచ్చి బియ్యం ఇంట్లో దింపుతున్నాడు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను ఇంటికి తెచ్చి ఇస్తున్నాడు.

– సత్తి సూర్యకాంతం, ఊబలంక

రాదనుకున్న రేషన్ కార్డు వచ్చేసింది



ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సహాయాలనూ వలంటీర్లు తెలియజేస్తున్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతి విషయాన్నీ మాకు చేరవేస్తున్నారు. కోవిడ్ సమయంలో కూడా ఎంతో సేవ చేశారు. గతంలో ఎన్నిసార్లు తిరిగినా నాకు రేషన్ కార్డు రాలేదు. ఇన్‌కం ట్యాక్స్ కడుతున్నట్టు వస్తోందని అధికారులు చెప్పేవారు. నాకు ఏమీ అర్థమయ్యేది కాదు. ఇక రేషన్ కార్డు రాదనుకున్నా. కానీ మా వలంటీర్ తారిట్ల విమల కావాల్సిన పత్రాలు పెట్టి రేషన్ కార్డు వచ్చేలా చేశారు. వలంటీర్ల సేవలు ఎనలేనివి.

– విపత్తి చలపతిరావు, రావులపాలెం

ఆపద్బాంధవుడిలా..



బియ్యం బస్తా మోసుకు వెళుతున్న వలంటీర్ యార్లగడ్డ మహేష్

రావులపాలెం సచివాలయం–4 పరిధిలోని ఇందిరా కాలనీలోని మూడంతస్తుల భవనం పై భాగంలో పోలవరపు సత్యనారాయణ కుటుంబం నివసించేది. కోవిడ్ బారిన పడిన వారు.. హోమ్ క్వారంటైన్‌తో బయటకు వెళ్లలేని దుస్థితి. కోవిడ్ లాక్‌డౌన్ సమయం కావడంతో చుట్టుపక్కల వారు, బంధువులు కూడా దగ్గరకు రాలేని పరిస్థితి. ఆ సమయంలో సత్యనారాయణ కుటుంబానికి అక్కడి వలంటీర్ యార్లగడ్డ మహేష్ ఆపద్బాంధవుడిలా నిలిచాడు. వారికి కావాల్సిన బియ్యాన్ని షాపు వద్ద కొనుగోలు చేసి, 50 కేజీల బస్తాను తానే స్వయంగా మోసుకుని వెళ్లి, వారికి అందజేసి, ఆపద సమయంలో వెలకట్టలేని సేవలు అందించాడు.

నిర్భాగ్యులకు తోడై..



నిర్భాగ్యులకు భోజనం అందిస్తున్న రావులపాలెం సచివాలయం-4 వలంటీర్లు, సిబ్బంది

కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో నిలువ నీడ లేక రోడ్ల పక్కనే ఆశ్రయం పొందే వారికి, భిక్షమెత్తుకుని జీవించే కుష్ఠు వ్యాధిగ్రస్తులకు ఆహారం దొరకని దారుణమైన పరిస్థితులు. ఆ సయయంలో ఆ దీనులకు రావులపాలెం సచివాలయం–4 పరిధిలోని సిబ్బంది, వలంటీర్లు వడ్లమూడి వీర్రాజు, గుడిమెట్ల సతీష్‌కుమార్‌రెడ్డి, మద్రె కిషోర్‌కుమార్, పెందుర్తి లావణ్య, యాలంగి ప్రవీణ్‌రాజు తదితరులు సొంత ఖర్చుతో నెల రోజుల పాటు ఆహారం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

రేషన్ కార్డు ఇచ్చి.. సంక్షేమ పథకాలు అందించి..



పట్టాభి రామారావుకు రేషన్ కార్డు అందిస్తున్న వలంటీర్ మణి, సచివాలయ సిబ్బంది

రావులపాలెం కేఎస్ఆర్ కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్న లింగోలు పట్టాభి రామారావు ఆధార్ నంబరుకు 120 ఎకరాల పొలం ఉన్నట్టు తప్పుగా లింక్ అయ్యింది. దీంతో ఆయనకు రేషన్ కార్డు రాలేదు. అలాగే ఆయన కుమార్తెకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అందలేదు. వారి సమస్యను గుర్తించిన వలంటీర్ బొండాడి మణి వారి నుంచి తగిన పత్రాలు తీసుకుని సచివాలయ సిబ్బంది సహకారంతో సమస్యను పరిష్కరించింది. దీంతో వారికి రేషన్ కార్డు వచ్చింది. ఫలితంగా కుమార్తెకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అందడంతో వారి ఆనందానికి అవధి లేకుండా పోయింది.

అశ్రునయనాలతో అల్లూరుకు కడపటి వీడ్కోలు



సఖినేటిపల్లిలో కృష్ణంరాజు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి వేణు, ఎమ్మెల్యే రాపాక



సోంపల్లిలో నివాళులర్పిస్తున్న విజయలక్ష్మి

సఖినేటిపల్లి: రాజోలు మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజుకు కుటుంబ సభ్యులు, బంధువులు, నాయకులు, అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అశ్రునయనాలతో గురువారం కడపటి వీడ్కోలు పలికారు. సఖినేటిపల్లిలో ఆయన పార్థివ దేహానికి పలువురు నివాళి అర్పించారు. వీరిలో రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరి, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్సీలు చైతన్యరాజు, రుద్రరాజు పద్మరాజు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, బొంతు రాజేశ్వరరావు, రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు, రాష్ట్ర నేత పీకే రావు, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చిన రాజా, కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, ఏపీఐఐసీ డైరెక్టర్ మట్టా శైలజ, మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు సరెళ్ల విజయ్ ప్రసాద్, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, దేవస్థానం మాజీ చైర్మన్లు పండురాజు, మాధవవర్మ, బీసీ నేత దొంగ నాగ సత్యనారాయణ నివాళులర్పించారు.

కృష్ణంరాజు మరణ వార్త కలచివేసింది

రాజోలు: అల్లూరు కృష్ణంరాజు మరణ వార్త కలచివేసిందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. సోంపల్లిలో జరిగిన ఆయన అంతిమ యాత్రలో ఆమె పాల్గొన్నారు. ఆయన పార్థివ దేహానికి నివాళి అర్పించారు. రాజోలు నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పార్టీ తూర్పు గోదావరి జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దల అను, సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు తదితరులు కూడా పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



నెల్లి జైశ్యామ్



సుతాపల్లి గీతిక



కర్రా స్వర్ణగీత




రావి రామ్‌గోపాల్‌తేజ

కొత్తపేట/అంబాజీపేట: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన పలువురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి, స్థానిక శ్రీనివాసపేటకు చెందిన నెల్లి జైశ్యామ్ టెన్త్‌లో 561 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో మండలం ప్రథముడిగా నిలిచాడు. అలాగే, స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని సుతాపల్లి గీతిక పదో తరగతిలో 559 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచింది.

ఈ విద్యార్థులిద్దరూ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్ఎంలు అల్లూరి గోపాలరాజు, ఎస్.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులను ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, పీఎంసీ చైర్మన్లు బీర శ్రీనివాసరావు, ములపర్తి శ్రీనివాసరావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు. కాగా, అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రావి రామ్‌గోపాల్‌తేజ ఒంగోలు, కర్రా స్వర్ణగీత నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు ఎంపికయ్యారని హెచ్ఎం కడలి సాయిరామ్ తెలిపారు. రామ్‌గోపాల్‌తేజ పదో తరగతిలో మండలం ప్రథమ, నియోజకవర్గంలో తృతీయ స్థానాలు సాధించాడు. స్వర్ణగీత మండలం ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ విద్యార్థులను ఎంఈఓలు కాంట్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, విద్యాకమిటీ చైర్మన్ అరిగెల రామతులసి, డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు, స్టాఫ్ కార్యదర్శి వెన్నపు సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తున్నాం

ఓఎన్‌జీసీ ఏరియా మేనేజర్ రావు



ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఓఎన్‌జీసీ ఉద్యోగులు

మామిడికుదురు: సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే దిశగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని ఓఎన్‌జీసీ తాటిపాక ఏరియా మేనేజర్ కేజేఎం రావు అన్నారు. స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా ఓఎన్‌జీసీ ఆధ్వర్యాన పాశర్లపూడిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం, దేశాన్ని ప్రగతి పథంలో నడిపిద్దాం అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. తొలుత 200 మంది స్థానికులకు టీ షర్టులు, టోపీలు, జొన్నలు, రాగులు, పండ్లు అందజేశారు. గ్రామ పంచాయతీకి ఐదు డస్ట్‌బిన్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రావు మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన తీసుకు వచ్చే దిశగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ది యంగ్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పి.సుశీల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు అంకాని వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, ఓఎన్‌జీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకున్నది జగన్ ప్రభుత్వమే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: అన్నదాతలను అన్నివిధాలా ఆదుకుంటున్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఎంపీడీఓ నాతి బుజ్జి ఆధ్వర్యాన ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, శాఖల వారీగా సమీక్షించారు. 2022 ఖరీఫ్‌లో మండల వ్యాప్తంగా 2,961 మంది రైతులకు సంబంధించి 3,657 హెక్టార్లలో దెబ్బ తిన్న అరటి తోటలకు రూ.1,50,87,185 నష్ట పరిహారం వచ్చిందని చెప్పారు. గతంలో ఎన్నడూ ఇలా పంటల బీమా కానీ, పంట నష్ట పరిహారం కానీ అందించలేదని గుర్తు చేశారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పారిశుధ్యంపై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. డ్రైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలుపై సూచనలు చేశారు. మంచం మీద ఉన్న రోగుల వద్దకే వెళ్లి, వైద్యం అందించి, ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు వివిధ సమస్యలు ఏకరువు పెట్టారు. వీటిని పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెన్మెత్స బంగారాజు, తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పాలన.. సీఎం జగన్ ఘనత



ఇసుకపూడిలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

అంబాజీపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ అన్నారు. ఇసుకపూడి, మొసలపల్లి సచివాలయాల వద్ద తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో సర్పంచ్‌లు తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు, బొక్కా గోపాలకృష్ణల అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంపులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వివిధ కారణాలతో పథకాలు అందుకోని వారిని గుర్తించి, వారికీ వర్తింపజేసేందుకే ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

అయినవిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ గ్రామస్తులను కోరారు. నేదునూరులో సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ఇళ్ల స్థలం లే అవుట్‌కు దారి లేదని, పంచాయతీ కార్యాలయం ముందున్న చెరువులో చెత్తను తొలగించాలని ఈ సందర్భంగా గ్రామస్తులు కోరారు. ఎంపీటీసీ సభ్యులు కట్టెపల్లి సుబ్బరాజు, ఇందుగుల వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే నల్లచెరువు గ్రామంలో ఎంపీడీఓ తాడి వెంకటాచార్య ఆధ్వర్యాన జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో..

ఆలమూరు: మండలంలోని మడికి-3, మోదుకూరు గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జిలు తమ్మన శ్రీనివాస్, నామాల శ్రీనివాస్ గురువారం తెలిపారు. మడికి-3లో తహసీల్దార్ ఐపి.శెట్టి, మోదుకూరులో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యాన ఈ శిబిరాలు జరుగుతాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పిచ్చి కుక్కల నుంచి విముక్తి కలిగించరూ..



అంబాజీపేట ప్రధాన రహదారిలో సంచరిస్తున్న కుక్కలు

అంబాజీపేట: మండలంలోని మాచవరం, అంబాజీపేట, ఇసుకపూడి, కె.పెదపూడి, ముక్కామల, వాకలగరువు తదితర గ్రామాల్లో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల్లో జనవరి నుంచి ఇప్పటి వరకూ సుమారు 160 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి.

మండలంలోని 16 గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ కుక్కలు నివాస ప్రాంతాల్లో ఉన్న వారిని, పాఠశాలకు వెళ్లే విద్యార్థులను, పాదచారులను గాయపరుస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి, కుక్కల బెడద నుంచి విముక్తి కలిగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చురుకుగా లెప్రసీ సర్వే

ఆలమూరు: పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో లెప్రసీ సర్వే చురుకుగా జరుగుతోంది. కుష్ఠు నివారణ మాసోత్సవాల్లో భాగంగా వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.మల్లికార్జున ఆధ్వర్యాన వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో పర్యటిస్తున్నారు. స్పర్శ లేని మచ్చలు ఏర్పడిన బాధితులను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటికే లెప్రసీ బారిన పడి, చికిత్స పొందుతున్న వారు త్వరితగతిన కోలుకునేలా బహుళ ఔషధ చికిత్స అందిస్తున్నారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెచ్ఈ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.ఉమ, సీహెచ్ బేబీ పాల్గొన్నారు.

భారీ వర్షంతో అధ్వానంగా రహదారులు



మామిడికుదురులో జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు

మామిడికుదురు: భారీ వర్షానికి నగరం నుంచి పాశర్లపూడి వరకూ ఉన్న 216వ నంబర్ జాతీయ రహదారిపై పలుచోట్ల నీరు భారీగా నిలిచిపోయింది. మామిడికుదురు పాత పోలీస్ స్టేషన్, పాశర్లపూడి కైకాలపేట, కొండాలమ్మచింత సెంటర్ సమీపాన వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ ప్రాంతాల్లో జాతీయ రహదారి దెబ్బ తిని, గుంతలు ఏర్పడి, నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నగరం జెడ్పీ హైస్కూల్ పక్కనే ఉన్న పంచాయతీరాజ్ రోడ్డు పైన అప్పనపల్లి శ్రీ కనక మహాలక్ష్మమ్మ ఆలయం, పెదపట్నంలంక గ్రామ దేవత మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల వద్ద కూడా వాన నీరు నిలిచిపోయింది. ఈ నీరు ఎటూ వెళ్లే దారి లేక పోవడంతో వర్షం తగ్గినా ముంపు బెడద తప్పలేదని స్థానికులు అన్నారు. రోడ్లపై నీరు నిలిచిపోకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి కె.శ్రీనివాస్ సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం ఇసుకపూడిలో నిర్వహించారు. రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రోగుల ఇళ్లకు వెళ్లి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.